క్రీడలతో పోటీతత్వం

• రెవెన్యూ క్రీడోత్సవాల ముగింపు సభలో కలెక్టర్


క్రీడోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా పోటీ తత్వం, ప్రశ్నించేతత్వం పెరుగుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన రెవెన్యూ క్రీడోత్సవాలు ఆదివారం రాత్రి క్యాంప్ ఫైర్‌తో ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా వచ్చిన స్ఫూర్తిని పనుల్లో చూపించనట్లయితే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది బాగా పనిచేస్తే, జిల్లా యంత్రాంగానికి మంచిపేరు వస్తుందని తెలిపారు. ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందిని అందరినీ ఒక చోటకు చేర్చి క్రీడలు నిర్వహించటం గొప్పవిషయమన్నారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

• తిలకించేందుకు వచ్చిన ఉద్యోగులు

శని, ఆదివారాల్లో వరుస సెలవులు రావటంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, వారి కుటుం బసభ్యులు రెవెన్యూ క్రీడలను తిలకించ డానికి వచ్చారు. క్రికెట్, షటిల్, వాలీ బాల్, ఫుట్‌బాల్, లాంగ్ జంప్, పరుగు పందెం, చెస్, క్యారమ్స్, షార్ట్‌పుట్, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో తదితర పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. చివరిరోజు కార్యక్రమానికి సీసీఎల్ఏ జీ. జయలక్ష్మి హాజరయ్యారు. ఆదివారం కలెక్టర్ టీం, డివిజన్ల టీమ్ మధ్య షటిల్, వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. జయలక్ష్మి, కలెక్టర్ కాసేపు షటిల్, వాలీబాల్ ఆడారు.

బహుమతుల అందజేత

మహిళా విభాగంలో 35 ఏళ్లలోపు 100 మీటర్ల పరుగుపందెంలో గెలుపొందిన సాహిత్య, అనూష, శాంతిప్రియలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జీ. జయలక్ష్మి కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అంద చేశారు. అలాగే 200 మీటర్ల పరుగుపందెంలో సాహిత్య, హవీ, శాంతిప్రియలకు, షార్ట్ పుట్‌లో శ్యామలత, అనూష, కావ్యశ్రీకు బహుమతులు అంద చేశారు. డిస్కస్‌త్రోలో సాయి శరణ్య, సుష్మిత, వదనలకు, జావెలిన్‌త్రోలో శాంతి ప్రియ, సాయి శరణ్య, సుస్మితవదనలకు, లాంగ్ జంప్‌లో సాయి శరణ్య, సాహిత్య, ఝాన్సీలకు, హైజంప్‌లో సాయి శరణ్య, శాంతి ప్రియ, హవీలకు బహుమతులు వచ్చాయి. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో నెల్లూరు, కందుకూరు టీమ్‌లకు బహుమ తులు అందచేశారు. ముగింపు కార్యక్రమంలో గురుకృప కళాక్షేత్రం, డేగా సాంబ శివరావు శిష్యం బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంత గానో అలరించాయి. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌వో హుస్సేన్ సాహెబ్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులందుకున్న వారితో సీసీఎల్ఏ జయలక్ష్మి, కలెక్టర్ ఆనంద్ తదితరులు


చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు


అతడే డాన్...!

• ఆయన కనుసన్నల్లోనే రేషన్ మాఫియా
• గుడిపల్లిపాడు కేంద్రంగా నడుస్తున్న వ్యవహారం
• అన్నీ నియోజకవర్గాల్లోనూ సిండికేట్లు
• సీఎస్ డీటీలకు తెలిసినా మౌనం
• సెగ్మెంట్‌కు నెలకు రూ.20 లక్షల పంపకాలు..?
• కలెక్టర్, జేసీ దృష్టి సారిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేరుకేమో అతనో సామాన్య వ్యక్తి... ఎవరూ నమ్మని విధంగా ఏదో చిన్న వ్యాపారం చేసుకుంటున్నాడులే అనుకునేలా ప్రవర్తిస్తుంటాడు... కానీ తెరవెనుక నడిపేది మాత్రం రేషన్ మాఫియాను..! ప్రతీ నెలా వేల టన్నుల రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం... తద్వారా రూ.కోట్లు ఆర్జించడం అతడి పని..! ఇదేదో ఇప్పుడు మొదలైం దనుకుంటే పొరపాటే... గత కొన్నేళ్లుగా రేషన్ మాఫియాకు ఆ వ్యక్తి నాయకుడిగా వ్యవహరి స్తున్నాడు. ప్రతీ నియోజకవర్గంలో రేషన్ సిండికేట్లు నడుస్తుండగా, వారందరికీ పెద్ద దిక్కుగా ఆ వ్యక్తి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. నెల్లూరు నగరంలో మూడు జెండాల సెంటర్‌కి చెందిన ఈ మాఫియా డాన్.. గుడిపల్లిపాడులోని పలు మిల్లుల కేంద్రంగా రేషన్ బియ్యం రీసైక్లింగ్‌ను జరుపుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. జిల్లా మార్కెట్ అవసరాలకు మించి రేషన్ బియ్యం తమ వద్దకు వస్తే.. ఆ బియ్యాన్ని కాకినాడ ప్రాంతానికి పంపుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ప్రభుత్వానికి చేరవేశాయి. అయితే ఈ రేషన్ అక్రమార్కులకు తెరవెనుక రాజకీయ నేతలు అండదండలు అందిస్తుండడం గమనార్హం. ఇందుకు వారికి భారీగానే లబ్ధి చేకూరుతున్నట్లు తెలుస్తోంది.

• తిలాపాపం తలా పిడికెడు

జిల్లాకు ప్రతీ నెలా సుమారు 10 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇందులో రెండు వేల టన్నులకు పైగా బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతున్నట్లు అంచనా. రేషన్ పంపిణీ చేసే సమయంలోనే కొనుగోళ్ల తంతు ముగుస్తోంది. రేషన్ దుకాణాల్లో ఇచ్చే బియ్యం నాణ్యతగా ఉంటున్నా, ప్రజల్లో ఈ బియ్యంపై అపోహలున్నాయి. ఈ కారణంతో చాలామంది బియ్యాన్ని చూడకుండానే రేషన్ దుకాణాల వద్దే డబ్బులు తీసేసుకుంటున్నారు. ఇలా కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.15కు తీసుకోవడం, ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి మార్కెట్లో కేజీ రూ.60కు పైగా విక్రయిస్తున్నారు. ఈ లెక్కన సుమారు ప్రతీ నెలా రూ.10 కోట్ల వరకూ మాఫియా సంపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ డబ్బును ప్రతీ నియోజకవర్గంలోనూ పంచుతున్నట్లు తెలుస్తోంది. మండల స్థాయి, నియోజకవర్గస్థాయి నేతలకు భారీగానే అందజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలకు వచ్చిన సమాచారం మేరకు ఒక్కో నియోజకవర్గంలో ప్రతీ నెలా రూ.20 లక్షల వరకూ ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు మాఫియా అందిస్తున్నట్లు తెలిసింది.



• ఉన్నతాధికారులు దృష్టి పెడితేనే..!

ప్రభుత్వ లక్ష్యానికి రేషన్ మాఫియా తూట్లు పొడుస్తోంది. పేదలకు ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని వారిలో అపోహలు కలిగించి ఆ బియ్యాన్ని తమ పరం చేసుకుంటోంది. తిరిగి ఇదే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పేదలకు అధిక ధరలకు విక్రయిస్తోంది. రేషన్ మాఫియా చేసే అక్రమాలన్నీ సీఎస్ టీడీలకు తెలుసునన్న ప్రచారం జరుగుతోంది. కొన్ని లారీల బియ్యం నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు కాకుండా మిల్లులకే చేరుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ప్రభుత్వం మారడంతో ఈ రేషన్ మాఫియా సభ్యులు.. అన్ని నియోజకవర్గాల్లో సాఫీగా వ్యాపారం చేసుకునేందుకు స్థానిక నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమాలకు బ్రేకులు పడాలంటే కలెక్టర్, జేసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల దగ్గర నుంచి రేషన్ దుకాణాలు, రైసు మిల్లుల వరకూ ఆకస్మికంగా తనిఖీలు చేస్తే చాలా వరకూ కట్టడి చేసే అవకాశాలున్నాయి.

ఎవరికి దక్కేనో..?

నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్ల ఆశలు
నెలాఖరుకు భర్తీ చేస్తామన్న మంత్రి లోకేష్
కావలి ఏఎంసీ, బిట్రగుంట ఆలయ పోస్టులపై చర్చ

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్ల ఆశలు పెట్టుకున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిలో ఏ కొద్దిమందికైనా ఈ పదవులు దక్కుతాయన్న ఆశల పల్లకీలో వారున్నారు.ఇటీవల నెల్లూరుకు వచ్చిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏఎంసీలు, ఆలయాల కమిటీలను ఈనెలాఖరుకు భర్తీ చేస్తామని స్పష్టత ఇచ్చారు. దీంతో అందరికీ పదవులపై ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులు ఎవరిని వరిస్తాయానన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

• ఏఎంసీ మహిళకు కేటాయింపు

కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పోస్టును తొలుత దగదర్తి మండలానికి చెందిన పమిడి రవికుమార్ చౌదరికి ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి గతంలో హామీ ఇచ్చారు. అయితే అనూహ్య పరిణామాలలో అది బీసీ మహిళకు ప్రభుత్వం రిజర్వు చేసింది. ఈ విషయమై ఎమ్మెల్యే పోరాడి దాన్ని ఓసీకి మార్పు చేయించినా మళ్లీ కూడా మహిళకే కేటాయించారు. గతంలో ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన మలిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు అప్ప చెప్పాలనుకుంటే ఆయన కూడా దానికి సమ్మతించలేదని తెలిసింది. సహజంగా కావలి ఏఎంసీ చైర్మన్లుగా పనిచేసిన వారంతా, ఆ తర్వాత రాజకీయంగా పెద్దగా ఎదుగుదల లేకపోవడంతో సెంటిమెంటుగా భావిస్తున్న కొందరు ఆ పదవి పట్ల ఆసక్తి చూపడం లేదనే ప్రచారం సాగుతోంది. దీంతో రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండే నేతల సతీమణులకు ఇచ్చేదానికన్నా చురుగ్గా ఉండే మహిళా నేతకే ఆ పదవి కట్టబెట్టాలనే ఆలోచనతో ఎమ్మెల్యే ఉన్నారు. వైస్ చైర్మన్, డైరెక్టర్లను కూడా నామినేట్ చేసే అవకాశం ఉండటంతో పలువురు వాటిపై ఆశలు పెంచుకున్నారు.

• ప్రసన్నుడి ఆలయ కమిటీ..

కొండ బిట్ర గుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ పాలకవర్గం చైర్మన్ పదవికోసం పలువురు ఆశావహులు పోటీలో ఉన్నా.. దైవభక్తి, ఆలయ అభివద్ధికి దాతల నుంచి నిధులు తీసుకురాగల సత్తా ఉన్న నేత అయితే, ఆలయం అభివృద్ధి చెందుతుందనే ఆలోచనలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు టీడీపీలో చేరిన శ్రీరాంమాల్యాద్రికి ఆ పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. కమిటీ డైరెక్టర్ల పదవులు కూడా ఉండటంతో వాటిని పలువురు ఆశిస్తున్నారు.


కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

• మూడు ఆలయాల కమిటీలపై కూడా...

కావలిలోని మూడు ఆలయాలకు కూడా నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయ నుండటంతో వాటిపై కూడా పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల దేవదాయశాఖలో కలిసిన కలుగోళ్ల శాంభవి ఆలయం, విష్ణాలయం, పాతూరు శివాలయాల కమిటీలు కొత్తవి కావడంతో వాటిపై పట్టణానికి చెందిన పలువురు కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇంతకు ఎవరిని పదవులు వరించనున్నాయో కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురు చేస్తున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ప్రదర్శన

• ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలి
• యూనియన్ నేతల డిమాండ్

నెల్లూరు (వైద్యం) జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం విధులను బహిష్కరించి, నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి మద్రాసు బస్టాంట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 10 నెలల నుంచి సీఎం చంద్రబాబుకు అనేక పర్యాయాలు అధికారులు విన్నవించినా నేటికి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వెంటనే కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులకు సంబంధించి హామీలు నేటికి నెరవేర్చలేదని చెప్పారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి గ్రాట్యూటీ చెల్లించాలని, బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 17 నుంచి సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ, శివాజీ, సురేష్, మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు శ్రీనివాసులు, బాలు, మనోజ్, కామాక్షమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

• ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. నెల్లూరులోని దేవిశెట్టి స్వాములు, రాజేశ్వరి కల్యాణ మండపంలో సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ప్రమాణ స్వీకార సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హాజరయ్యారు. టిడ్కో గృహాలను అర్హులైన బ్రాహ్మణులకు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకట రామరాజు, రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్(నెల్లూరు), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గాలి శ్రీనివాసరావు (వినుకొండ), ప్రధాన కార్యదర్శిగా వేదం హరిప్రసాద్ (తిరుపతి), కోశాధికారిగా ఎన్ ఉమామహేశ్వరావు (కడప)తోపాటు రాష్ట్ర కార్యవర్గం, మహిళా కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. రాష్ట్ర మాజీ కార్యదర్శి వాసుదేవరావు, భువనేశ్వరీ ప్రసాద్ పాల్గొన్నారు.


సమాఖ్య కార్యవర్గంతో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

ఈడీ నోటీసుల జాబితాలో జిల్లా శ్రీమంతులు

• హవాలా మార్గంలో దుబాయ్‌లో ఆస్తుల కొనుగోలు ఫలితం
• బెంగళూరు కేంద్రంగా హవాలా మార్గంలో నగదు చెల్లింపులు
• రహస్య మార్గాల్లో వివరాలు సేకరించిన ఈడీ

నెల్లూరు, జూలై13 (ఆంధ్రజ్యోతి): హవాలా మార్గంలో దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం, అపార్టుమెంట్లలో ప్లాట్ల కొనుగోలు చేసిన వారిలో జిల్లా సంపన్నులు ఉన్నారా..!? ఈడీ నోటీసుల జాబితాలో మన వారు ఉన్నారా..!? అంటే... అవును ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దుబాయ్‌లో జిల్లా శ్రీమంతులు ఆస్తులు కొన్నారని, ఆ క్రమంలోనే వారికి ఈడీ నోటీసులు ఇచ్చిందని, వాటిని పట్టుకొని వారు ఆడిటర్ల చుట్టూ తిరుగుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంతకు నెల్లూరు ధనవంతులేమిటీ..!? దుబాయ్‌లో ఎందుకు ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు, అలా చేస్తే తప్పేమిటి..? వీరికి ఎందుకు ఈడీ నోటీసులు ఇస్తోంది..? అనే వివరాల్లోకి వెళితే ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

• దుబాయ్‌లో ఎందుకు కొంటున్నారంటే..!!?

రాయలసీమ జిల్లాల్లో కాయ కష్టం చేసుకునేవారికి ఆశ్రయం కలిగించే దేశంగా దుబాయ్ తెలుసు. కాని నెల్లూరు జిల్లా లాంటి సంపన్న జిల్లాలకు దుబాయ్ విస్తరిస్తున్న విలాస దేశంగానే తెలుసు. దుబాయ్ కష్టజీవులకు ఎలా ఉపాధి కేంద్రమో శ్రీమంతులకు ఇది ఒక భూతలస్వర్గం. క్రమక్రమంగా ఈ దేశానికి విదేశీ సంపన్నుల పర్యటనలు ఎక్కువ కావడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. దీంతో నెల్లూరీయుల కన్ను దుబాయ్‌పై పడింది. హవాలా ద్వారా ఇక్క డ ఆస్తులు కొంటే ఆదాయ పన్నుల శాఖ నివేదికలో వీటిని చూపించాల్సిన అవసరం లేకుండా అపార్టుమెంట్ల ద్వారా వచ్చే అద్దె రూపంలో పెట్టిన పెట్టుబడిపై 15 నుంచి 20 శాతం ఆదాయం పొందవచ్చనే ఉద్దేశ్యంతో దేశంలోని చాలా మంది శ్రీమంతులు దుబాయ్‌లో ఆస్తులు కొంటున్నారు.



• దుబాయ్‌లో నెల్లూరు ముద్ర

రాష్ట్రంలోని సంపన్న జిల్లాల్లో నెల్లూరు ఒకటి. ఇక్కడ వందల,వేల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన శ్రీమంతులు వందల సంఖ్యలో ఉన్నట్లు అంచనా. సంపన్నులైన రాజకీయ నాయకులే కాకుండా అజ్ఞాతంగా వీరిని మించిన ధనవంతులు కూడా నెల్లూరులో చాలా మంది ఉన్నారు. ఇలాంటి వారిలో కొందరు తమ పెట్టుబడులను దుబాయ్‌కి మళ్లించినట్లు తెలిసింది. బెంగళూరు కేంద్రంగా వీరు క్రిప్టో, హవాలా రూపంలో పెట్టుబడులను చేరవేశారు. ఇలా దుబాయ్‌లో ఆస్తులు కొన్న వారి జాబితాను ఈడీ సేకరించింది. వీరందరికి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన కొందరికి ఈడీ నుంచి నోటీసులు అందడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా నోటీసులు వచ్చిన వారు ఆడిటర్లను కలవడం, వారు ఇది తమ పరిధిలో చేయలేమని హైదరాబాద్‌లో తాము సూచించిన ఆడిటర్లను కలవమని సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఆనోటా ఈనోటా ఈ విషయం ప్రచారం కావడంతో ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో దుబాయ్ ఆస్తుల వ్యవహారం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

నిమ్మ ధరలు ఢమాల్

• మార్కెట్‌కు నాణ్యత లేని సరుకు
• ఢిల్లీకి నిలిచిన ఎగుమతులు • నష్టాల్లో రైతులు

పొదలకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నిమ్మ కాయల ధరలు పతనమ య్యాయి. కోత కూలి ఖర్చులు కూడా రాక రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌కు వచ్చే కాయల నాణ్యత లోపించడం వల్ల ఢిల్లీ ఎగుమతులు నిలిచిపోయి ధరలు మరింతగా దిగజారుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఆదివారం పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో కేజీ కాయలు రూ.10 నుంచి రూ.20 వరకు ధర పలికాయి. మార్కెట్‌కు వచ్చే కాయలు నాణ్యత లేని కారణంగా ఢిల్లీ మార్కెట్‌కు రోజుకు ఒక్క లారీని పంపేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఢిల్లీకి సరుకు పోవడానికి మూడు రోజుల సమయం పడుతుంది. అప్పటివరకు కాయలు దెబ్బతినకుండా ఉంటే మాత్రమే పంపుతారు. కూలీలను ఏర్పాటు చేసుకుని కోసే కాయల్లో సగానికి పైగా మచ్చలున్నవి ఉంటున్నాయి. దీంతో వాటిని మార్కెట్‌లో పక్కన పెట్టేస్తున్నామని, నాణ్యత బాగా ఉంటేనే ఢిల్లీకి ఎగుమతి చేస్తామని, లేదంటే తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. ధరలు లేకపోవడంతో రైతులు కాయలను చెట్లకే వదిలి వేస్తున్నారు.


నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సోమశిల పవర్ ప్లాంట్‌లో సాంకేతిక లోపం ?

అనంతసాగరం జూలై 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద ఉన్న పవర్ ప్లాంట్‌లో సాంకేతిక లోపం తలెత్తిన్నట్లు తెలిసింది. దీంతో కొంత మేరకు నీటిని క్రస్ట్‌గేట్ ద్వారా దిగువకు సరఫరా చేస్తున్నారు. పవర్ ప్లాంట్‌లో నాలుగు యూనిట్ల ద్వారా 20 మెగా వాట్స్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. కాగా డ్యాం నుంచి నీరు పంపుల ద్వారా తీసుకునే క్రమంలో వారం క్రితం సాంకేతిక సమస్య రాగా, 6వ నెంబరు గేటు ద్వారా 500 క్యూసెక్కులను నీటిని ఇంజనీర్లు విడుదల చేశారు. జలాశయానికి కృష్ణా జలాల రాక ప్రారంభం అయింది.ఈ సమయంలో వనరులన్నీ సిద్ధంగా ఉండాలి. నీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా అందుకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. కాగా పవర్ టన్నెల్‌లో నెలకొన్న సమస్యపై జలాశయం ఎస్‌ఈ వెంకట రమణారెడ్డిని వివరణ కోరగా అది ప్రైవేటు సంస్థకు చెందిందని, అందులో సాంకేతిక సమస్య వచ్చిందని తెలిసి 6వగేటు ద్వారా కొంత నీటిని విడుదల చేశామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9414
వెండి కిలో ధర	రూ. 115600
వెండి ఒక గ్రాము	రూ.118.60

సాయిదర్బార్‌లో కంటి వైద్య శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13(ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ సాయి దర్బార్‌లో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మెగా కంటి శస్త్ర చికిత్స వైద్య శిబిరం జరిగింది. మాడరన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన 45 మందికి ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. ఈ శిబిరంలో డాక్టరు వినీల హేమలత, ఆసుపత్రి సీఈవో రామసుబ్బారావు, మందిరం చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు. కాగా, గాంధీబొమ్మ కూడలి సమీపంలోని బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు కొనసాగుతున్నాయి.

న్యూస్ బాక్స్

ఆగస్టు 27 నుంచి గణేష్ ఉత్సవాలు

ఏర్పాట్లపై ఉత్సవ సమితి సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి సమావేశం నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో ఆదివారం జరిగింది. సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు మాట్లాడు తూ గణేష్ ఉత్సవాలు ఆగస్టు 27 నుంచి జరుగుతాయని, 31వతేదీన సామూహిక గణేష్ నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. సమితి కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు మెరుగ్గా నిర్వహించాలంటే ప్రభుత్వం సహకరించాలని కోరారు. స్వర్ణాల చెరువులో తగినంత నీటిని నిల్వ చేయాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. గణేష్ ఘాట్‌లో శాశ్వత విద్యుత్ దీపాలు వేయాలని, ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్దనున్న ఘాట్‌ను స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయం వరకు విస్తరించాలని కోరారు. ఘాట్ పక్కనున్న స్థలాన్ని శాశ్వత పార్కింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, శ్రీకాంత్, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తలదించుకునేలా ప్రసన్న వ్యాఖ్యలు : జనసేన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని జనసేన పార్టీ వీర మహిళ విజయలక్ష్మి అన్నారు. మహిళలపై అసభ్యకరంగా మాట్లాడాలంటే భయపడేలా చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రశాంతిరెడ్డికి మద్దతుగా ప్రతీ మహిళ రుద్రమదేవితో సాటి అనే పోస్టర్లను ఆవిష్కరించారు. కృష్ణవేణి, రామాల జయలక్ష్మి, సునీత, ప్రవల్లిక, ప్రశాంతి, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యలమవారిదిన్నె ప్రాంతానికి చెందిన కాయల మోహన్ చందు (21) అనే యువకుడు కనిపించడం లేదని ఫిర్యాదు అందిందని రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. కారు డ్రైవర్‌గా పనిచేసే మోహన్ ఐదు రోజులుగా ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

కృష్ణా... కృష్ణ కృష్ణ !!

● భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం వేడుక అత్యంత భక్తిశ్రద్ధలలో జరిగింది. ద్రౌపదీదేవి, శ్రీకృష్ణుడు, పంచ పాండవుల ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన ఈ వేడుక విజయవంతంగా ముగిసింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం చప్పర ఉత్సవం, విశేష పూజలు జరిగాయి. రాత్రి మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.



అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా తరలివస్తున్న ద్రౌపదీదేవి, శ్రీకృష్ణుడు, పాండవులు

ఆధునిక వైద్య విధానాలపై సదస్సు

నెల్లూరు (వైద్యం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి ఆధునిక, సాంకేతిక వైద్య విధానాలను వైద్యులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అపోలో ఆసుపత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రావణ్‌రెడ్డి వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) సదస్సు జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 280 మంది వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్సలలో అనేక మార్పులు వచ్చాయని, వీటిని తెలుసుకుని తదనుగుణంగా వైద్యం చేయాలని కోరారు. నేటి ఆధునిక వైద్య విధానాలలో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, పల్మనాలజీ అసోసి యేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ మల్లికార్జున, అపోలో ఆసు పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, పల్మనాలజిస్ట్ ఉమామహేష్, యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను చక్కదిద్దుదతున్న చంద్రబాబు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం) జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చక్కదిద్దుతున్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని 48వ డివిజన్‌లో కోటంరెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరు పెంచలయ్య, ఇంతియాజ్, కీర్తి, నౌషాద్, రాజేష్, నవీన్, శ్యాం తదితరులు పాల్గొన్నారు



దోసెలు పోస్తున్న శ్రీనివాసులు రెడ్డి

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రూరల్‌లోని ధనలక్ష్మీపురంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే రక్తదాతలు నిజమైన హీరోలని కొనియాడారు. రక్తదాతలకు జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, నోవా బ్లడ్ బ్యాంకు ఏవో ఎం భాస్కర్‌నాయుడు, నాగేశ్వరరావు, ఏఏఎఫ్ అధినేత ఆల్తూరి మస్తానయ్య, సొసైటీ సభ్యులు కుంచాల వినయ్, కిరణ్, పవన్‌కుమార్‌రెడ్డి, బాబ్జీ పాల్గొన్నారు. కాగా, 20వ డివిజన్ ఇస్కాన్ సిటీలో నిర్మించిన సీసీరోడ్డును గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు.

స్టేడియంలో ఆరోగ్య శిబిరం

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రుమటాలజిస్ట్ డాక్టర్ కిషోర్‌బాబు హాజరై వాకర్స్‌కు కీళ్లు, ఎముకలు, కండరాల వ్యాధుల గురించి తెలియ చేశారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు.

ఆహార భద్రతలో లోపాలుంటే శిక్ష తప్పదు

● ఆహార పదార్థాలను వేడిగా వడ్డించాలి

● సహాయ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు



నెల్లూరు(సిటీ), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అనారోగ్య సమస్య వాటిల్లకుండా ఆహార భద్రతలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార రంగంలోని వారికి ఆహార భద్రత జిల్లా సహాయ కంట్రోల్ అధికారి జీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హోటళ్లలో 60 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గకుండా వేడిగా ఆహారం వడ్డించాలని, శీతల పానీయాలను నిబంధనల మేరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇటీవల ఆహారం లో బల్లి, బొద్దింక, జెర్రి రావడాన్ని తమ తీవ్రంగా పరిగణించి సద రు ఆహార నమూనాలను పరీక్షలకు పంపించామని చెప్పారు. వా టి ఫలితాలు రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆహార భద్రత నియమ, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని, భారీగా జరిమానా, శిక్షలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లలో వంటశాలలు శుభ్రంగా ఉండాలన్నారు. చిన్న, మధ్య, ఉన్నత శ్రేణి హోటళ్లు, ఇతర ఫుడ్ సెంటర్లు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆహారం తయారీలో సింథటిక్ రంగులు వాడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

హోటళ్లలో ఎంహెచ్‌వో తనిఖీ

నెల్లూరు(సిటీ), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో కార్పొరేషన్ ఆరోగ్య అధికారి చైతన్య ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ సమీపంలోని శ్రీనివాస భవన్‌ను తనిఖీ చేసి, ఎన్‌వోసీతో పాటు, ట్రేడ్‌లైసెన్సులను తమ కార్యాలయానికి తీసుకురావాలని ఆదేశించారు. వంటశాల, హోటల్ నిర్వహణ తీరు మెరుగుపరచాలని నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో ఆహార భద్రత అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎక్కడున్నా సీజ్ చేసి భారీ జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

ఆంధ్రాకు ఐదు అవార్డులు సంతోషం

● మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు రూరల్, జూలై 13,(ఆంధ్రజ్యోతి) : కేంద్రం నుంచి ఆంధ్రకు ఐదు అవార్డులు రావడం సంతోషంగా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్కు 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. 25 మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో ఐదు అవార్డులను కేంద్రం ఏపీకి ప్రకటిం చిందని చెప్పారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, రాజ మండ్రి మున్సిపాలిటీలకు ఈ అవార్డులు దక్కాయని తెలిపారు. మరిన్ని అవార్డులకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుత చిల్డ్రన్స్ పార్కు ఉన్న ప్రాంతంలో డంపింగ్ యార్డు ఉంటే దానిని 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చిల్డ్రన్స్ పార్కుగా మార్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నాయకులు వీబీఆర్, అనురాధ, మామిడాల మధు, కర్తం ప్రతాప్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ నాయకులు రామ్మూర్తి, పెంచలప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ

నెల్లూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వావిలేటిపాడులో గత నెల 13వ తేదీ నుంచి జరుగుతున్న ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ -2025 పోటీలు ఆదివారంతో ముగిశాయి. వావిలేటిపాడుకు చెందిన గల్లీ గ్రాడియేటర్స్ జట్టు విజేతగా నిలిచింది. అదే ప్రాంతానికి చెందిన రాయల్ స్ట్రీట్ జట్టు రెండవ స్థానం సాధించింది. విజేతలకు టీడీపీ మైనార్టీ నాయకులు గౌస్‌అహ్మద్, ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ చైర్మన్ మస్తానయ్య ట్రోఫీ అందచేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, చురుకుదనం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు అతహర్, సాజిద్ పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీ అందచేస్తున్న టీడీపీ నాయకులు

బంగారు గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వివాహిత మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు దోచుకెళ్లారు. నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ పరిధిలో ఉన్న లక్ష్మీపార్వతినగర్‌లో ఆదివారం ఈ చోరీ జరిగింది. ఎండల తీవ్రత వల్ల ఉక్కపోతగా ఉండటంతో స్థానికురాలైన సౌమ్య అనే మహిళ ఇంటి తలుపు ఓరగా తెరచి నిద్రిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి సౌమ్య మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంచుకెళ్లాడు. బాధితులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ప్రసన్న తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విడవలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళల పట్ల తన తీరు మార్చుకోవాలని క్లస్టర్ ఇన్‌చార్జి కొమ్మి శ్రీధర్‌నాయుడు హితవు పలికారు. వావిళ్ల గ్రామంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. పేదలకు నిరంతరం సేవ చేస్తున్న వేమిరెడ్డి దంపతులపై విమర్శలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాగేశ్వరరావు, రాజా, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, విజయరాఘవన్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభగిరి పట్నంలో జనసేన గ్రామసభ

పొదలకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీని బలోపేతం చేయడం కోసం గ్రామ స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నారదాసు రవి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభగిరి పట్నం హరిజనవాడలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొబ్బేపల్లి సురేష్ నాయుడు, వాణి భవాని, సుందూరు శ్రీహరి, యనమల మధు, మనోజ్, బండి కొమ్మల ప్రసాద్, దినేష్, భాస్కర్, వినయ్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా భయన చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి, ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇసుకా'సురుల ఆట కట్టించేదెవరు?

● విచ్చలవిడిగా రీచ్‌ల తరలింపు ● ఎన్జీటీ ఆదేశాలను గాలికొదిలేసిన అధికారులు ● చుట్టపుచూపుగా తనిఖీలు, వాహనాల స్వాధీనం

'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు' అనే మాటను ఇసుకాసురులు ఆదర్శంగా తీసుకున్నారేమో... ఏకంగా ఇసుకలోనూ 'కాసుల' పంట పండిస్తున్నారు. పనిలో పనిగా అధికారులకూ వాటాలు పంపిస్తున్నారు. తామేం చేసినా అడిగేవారే లేరన్నట్లు వ్యవహ రిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులే ఎన్జీటీ ఆదేశాలను గాలికొదిలేశారు. దీంతో రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.



జొన్నవాడ ఇసుక రీచ్‌లో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. మండలంలోని జొన్నవాడ, మినగల్లు, కాళయకాగొల్లు, దామరమడుగు పంచాయతీ పరిధిలోని పెన్నానది తీరంలో పట్టపగలే అక్రమంగా ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పగలంతా ట్రాక్టర్లు.. అర్ధరాత్రి నుంచి టిప్పర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులే ఎన్జీటీ ఆదేశాలను సైతం గాలికొదిలేయడం గమనార్హం. చుట్టపు చూపుగా ఎప్పుడో ఒకసారి సుడిగాలి తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. నదిలో రోడ్లు వేసి మరీ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా... అధికారుల తీరు మాత్రం.. 'కళ్లుమూసుకున్నాం కానిచ్చేయండి' అన్న చందంగా ఉందని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

● సిబ్బందిని తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు

ఇటీవల మండలంలోని పలు రీచ్‌లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, మైనింగ్ శాఖల సిబ్బంది నాలుగు రోజులు హడావిడి చేశారు. ట్రాక్టర్లను కూడా అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయించారు. ఆ తరువాత ఏం జరిగిందో గానీ తనిఖీలు, దాడుల కు స్వస్తి పలికారు. అంతేకాకుండా అధికారులే సిబ్బందిపై "మీరు దాడులు చేసి వాహనాలు పట్టుకుని కేసులు పెట్టినంతమాత్రాన ప్రభుత్వం కిరీటాలేం పెట్టదు" అంటూ సాక్షాత్తూ ఓ శాఖ అధికారే సిబ్బందికి హితవు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాదు.. మీ ఇష్టం.. ఇసుక రీచ్‌ల్లోకి వెళ్తే వాహనాలతో తొక్కించేస్తారు.. అంటూ ఆయన హెచ్చరికలు కూడా చేసినట్లు తెలుస్తోంది. ట్రిప్పు లకు మామూళ్ళు ఇచ్చే వారి జోలికి వెళ్ళకుండా.. ఇవ్వని వాళ్ల ట్రాక్టర్లపై దాడి చేసి, అదుపులోకి తీసుకునేందుకు మామూళ్ళిచ్చేవాళ్ళే సమాచారం ఇస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ఏదిఏమైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నత న్యాయస్థానం ఎన్జీటీతో ఇచ్చిన ఆదేశాలే పలు ప్రధాన శాఖల అధికారులకు కలిసొస్తు న్నాయని కొందరు చెబుతున్నారు.

దెబ్బ తిన్న బేరు రైతన్నల బేజారు



బేరు వద్ద దెబ్బతిన్న చెక్కలు

మనుబోలు, జూలై 13: కండలేరు జలాలు మనుబోలు పెద్ద చెరువుకు చేరాలంటే చిత్రంలో కనిపిస్తున్న ఈ కాలువగుండానే రావాల్సి ఉంటుంది. వీరంపల్లి వద్ద కాలువకు వచ్చే నీరును కిందకు వదిలేందుకు, తగ్గించేందుకు రెండు చెక్కలు ఏర్పాటు చేశారు. దీనిని ఇక్కడ రైతులు బేరు అంటారు. ఈ చెక్కలు దెబ్బతిని, నీళ్లలో పడిపోయి 6 నెలలు కావస్తోంది. దీంతో కాలువకు నీరు సక్రమంగా పారుదల కాక, పంటలు ఎండి పోవడంతో మనుబోలు రైతులు టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో బేరువద్దకు వెళ్ళి ఎక్స్‌కవేటర్‌తో చెక్కలను తొలగించి నీటిపారుదలకు మార్గం చేసుకున్నారు. ఈ కాలువ గుండా మనుబోలు చెరువుకు నీరు చేరితే అక్కడినుంచి పిడూరు, కాగితాలపూరు, చెర్లోపల్లి గ్రామాలకు సాగునీరు వెళుతుంది. మరల వర్షాకాలం సమీపిస్తున్న నీటిపారుదల అధికారులు బేరు వద్ద దెబ్బతిన్న బండను, అక్కడ కొత్త చెక్కలను ఏర్పాటుచేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువకు ప్రవాహం ఎక్కువైనప్పుడు ఈ చెక్కలు ఉంటే నియంత్రణకు ఉపయోగపడతాయి. లేదంటే చెరువు ఉబ్బి ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు చెపుతున్నారు. ఇకనైనా నీటిపారుదల అధికారులు స్పందించి రైతులు విన్నపంపై బేరును బాగుచేయించి, చెక్కలు కొత్తవి ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ డీఈ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా చెక్కలు, బండ కొత్తగా నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆదేశాలు రాగానే వర్షాకాలంలోపే బేరు బాగుచేయిస్తామని తెలిపారు.



ఫిబ్రవరిలో దెబ్బతిన్న చెక్కలను ఎక్స్‌కవేటర్‌తో తీస్తున్న రైతులు (ఫైల్)

అంకమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అంకమ్మకు ప్రత్యేక అలంకరణ

మనుబోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన మనుబోలులో శనివారం అర్ధరాత్రి అంకమ్మ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. రజకసంఘం ఆధ్వర్యంలో స్థానిక చాకలి వీధిలో వెలసిన అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంకమ్మను గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్లో ఊరేగించారు. విద్యుద్దీపాలు, బాణాసంచా, తప్పెట్ల సందడి మధ్య జరిగిన గ్రామోత్సవం ఆదివారం వరకు మనుబోలు వీధుల్లో వైభవంగా సాగింది. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్ళు పొంగించి రజకులు మొక్కులు తీర్చుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రాపూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బైక్ మెకానిక్ నగిరి వేణు కుటుంబానికి పిల్లల చదువు నిమిత్తం విక్రమ సింహపురి టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షుడు షేక్ అన్వర్‌బాషా, వైస్ ప్రెసిడెంట్ ఎస్.డి. రఫీ, మండల గౌరవ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మండల అధ్యక్షుడు రియాజ్‌బాషా, యూనియన్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ తిరునాళ్ల

రాపూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగమ్మతల్లి తిరునాళ్ల ఆదివారంతో వైభవంగా ముగిసింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బద్దె గెర్రె కార్యక్రమంతో జాతర ముగిసింది.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వరిణి పంచాయతీ గిరిజన కాలనీలో అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం ఆర్థిక సహాయం ప్రకటించారు. స్థానిక మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం బాధితులు అంకులయ్య, శీనమ్మ కుటుంబ సభ్యులకు రూ. 50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా అడపాల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎమ్మెల్యే అదుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కుడుముల మల్లికార్జున, మద్దులూరు రాజా, బద్దిపూడి రాజా, సోమయ్య, బెల్లంకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కామాక్షితాయికి ఆషాఢ మాసం సారె పూజలు

మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షి తాయి ఆలయంలో ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఆషాఢ మాసం సారె పూజల్లో భాగంగా ఆదివారం అత్యధిక సంఖ్యలో ముత్తయిదువలు, మహిళలు, భక్తులు కామాక్షితాయికి సారెలు సమర్పించుకున్నారు. పూజల అనంతరం పురోహితులు, వేదపండితులు, అర్చకులు భక్తులకు అందజేసిన సారెలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

ప్రమాదకర ప్రాంతాల్లో పర్యాటకుల సెల్ఫీలు



సోమశిల జలాశయం నుంచి డెల్టాకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే కొందరు పర్యాటకులు ఏమాత్రం భయం లేకుండా ప్రమాదకర ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్యాం ముందుభాగంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అప్రాన్ వద్ద కొందరు యువకులు సెల్ఫీలు దిగుతుండగా స్థానిక జాలర్లు వారిని మందలించి తరిమేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో జనసంచారం లేకుండా ప్రాజెక్టు సిబ్బంది చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రేపు మహాధర్నా

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మంగళవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ రఘునాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెన్షనర్స్ ధర్నా జరుగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ ఎలివేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్సీ బకాయిలు తక్షణం చెల్లించాలని కోరుతున్నామని తెలిపారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ ధర్నాకు తరలిరా వాలని కోరారు.





ఇరగాళమ్మ ఆలయం, అమ్మవారికి శాకంబరి అలంకరణ

శాకంబరిగా ఇరగాళమ్మ


నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని, ఆలయాన్ని సుందరంగా అలంకరిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఇరగాళమ్మను దర్శించుకున్నారు. గంగిశెట్టి సాయికుమార్ ఉభయ కర్తగా వ్యవహరించారు. ఈవో గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్ పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి సేవలో సీసీఎల్ఏ జయలక్ష్మి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయాన్ని ఆదివారం భూ పరిపాలన శాఖ రాష్ట్ర ముఖ్య కమిషనర్(సీసీఎల్ఏ) జయలక్ష్మి సందర్శించారు. ఆమెకు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలు చేసి వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన భూములకు సంబంధించి వినతులను సహాయ కమిషనర్ చేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి
- ఏడాదికి 50 నుంచి 90 వేలమందికి చికిత్స
- ప్రభుత్వానికి వైద్య ఆరోగ్యశాఖ నివేదిక
- అన్నీ రకాల వైద్యచికిత్సలు అందించాలని ప్రణాళికలు



ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంలో ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ఆసుపత్రిలో అన్నీ వైద్యచికిత్సలు అందించడంతోపాటు ఏడాదికి 50 నుంచి 90 వేలమందికి స్పెషాలిటీ వైద్య సేవలు అందచేయాలని ప్రణాళికలు రూపొందించింది.

- నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి):

ప్రతి నియోజకవర్గ పరిధిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల(సీహెచ్‌సీలు)తో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఉన్న అవకా శాలు... ఎంతమంది వైద్యులు, సిబ్బంది అవసరం...ఎక్కడ ఆసుపత్రి ఏర్పాటు చేస్తే బాగుంటుందనే విషయాలపై నివేదిక పంపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఇందుకు అనుగుణంగా అధికారులు నివేదకను పంపారు.

ఏయే విభాగాలు

కొత్తగా ఏర్పాటు చేసే ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్‌తోపాటు జనరల్ సర్జరీ, గర్భకోశ చిన్నపిల్లల వ్యాధులు, చెవి,ముక్కు,గొంతు, కంటి, ఎముకలు,కీళ్ల వ్యాధులు, రేడియాలజీ, దంతవ్యాధులతోపాటు మత్తు వైద్య నిపుణులు అందుబాటులోకి రానున్నారు.ఒక్కో నియోజకవర్గ పరిధిలో ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు ప్రతిరోజూ 50 వేల నుంచి 90వేలకుపైగా రోగులు వస్తుంటారు. వీరిలో అనేకమంది చిన్నపిల్లల వ్యాధులు, కాళ్లు, చేతులు విరిగినవారు, కంటి, దంత వ్యాధులతో బాధపడేవారున్నారు. ఈ నేపథ్యంలో స్పెషాలిటీ వైద్య సేవలను నియోజకవర్గ ప్రజ లకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.

మూడుచోట్ల మాత్రమే అవసరం

జిల్లాలో రెండు నియోజకవర్గాలకు ఒక 100 పడకల ఆసుపత్రి పెడితే సరిపోతుందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పంపిన నివేదికలో పేర్కొన్నారు. మిగిలిన నియోజక వర్గాల్లో జీజీహెచ్‌తోపాటు జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు నియోజక వర్గాలకు నగరంలోని జీజీహెచ్‌లో ఉన్న 750 పడకలు సరిపోతాయని, ఆత్మకూరు నియోజక వర్గంలో 150 పడకల జిల్లా ఆసు పత్రి, కందుకూరు, కావలి నియోజకవర్గాలకు 100 పడకల ఏరియా ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. అయితే ఉదయగిరి నియోజక వర్గంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్యశాఖ పేర్కొంది. అలాగే సర్వేపల్లి నియోజ కవర్గానికి సంబంధించి పొదలకూరులోని సీహెచ్‌సీని 100 పడకలుగా మార్చాలని వైద్యశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతోపాటు తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు పీహెచ్‌సీలు, ఓ సీహెచ్‌సీ నెల్లూరు జిల్లా పరిధిలో ఉండటంతో 50 పడకలు ఉన్న రాపూరు సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని పేర్కొంది.

వైద్యులు, సిబ్బంది నియామకమెప్పుడు ?

కొత్తగా ఏర్పాటు చేసే ఈ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం చేపట్టాల్సి ఉంది. అయితే వీరి నియామకం ఎప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్యులతోపాటు సిబ్బందిని కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా త్వరలోనే వీరి నియామకాలు పూర్తవుతా యని వైద్యాధికారులు పేర్కొన్నారు.

నివేదిక పంపాం..

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లాలో అవకాశాల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. ఈ ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే గ్రామీణులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అత్యుత్తమ వైద్యచికిత్సలు అందించే వీలుంటుంది.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



వీఆర్‌లో అ'పూర్వ' కలయిక

మంత్రి నారాయణ, మిత్రుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థుల కలయికలో మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని చారిత్రక వీఆర్ పాఠశాలలో దశాబ్దాల క్రితం చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన చిన్ననాటి మిత్రులతో కలిసి సందడి చేశారు. బాల్య స్నేహితులను ఆప్యాయంగా పలకరించి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నారు. దశాబ్దాల తర్వాత స్నేహితులను కలుసుకోవడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు పలకరించుకుని ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నామో చెప్పుకుంటూ ఆనందాన్ని పొందారు. తాము చదివిన పాఠశాల రూపురేఖలు మారి పోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి నారాయణను అభినందించారు. అనంతరం మంత్రి, ఆయన మిత్రులు కలిసి వారికి చదువు చెప్పిన నాటి లెక్కల మాస్టర్ నరసింహారెడ్డి, సైన్స్ మాస్టర్ చంద్రశేఖర్‌ను సత్కరించారు.



నాటి గురువులను సత్కరిస్తున్న మంత్రి

టూరిజం కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం

వెంకటాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో అడ్మిషన్లు ప్రారం భమైనట్లు కళాశాల అడ్మిషన్ కమిటీ సభ్యుడు చాంద్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో అధునాతన విద్యను అందించే ఐఐటీటీఎం (టూరిజం) కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, బీబీఏ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీకి చెందిన విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. పూర్తి వివరాలకు 99664 62786 నంబర్లో సంప్రదించాలన్నారు.

సోమశిలకు 2,148 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 2,418 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం నుంచి కష్ణా జలాల రాకతో మూడు రోజులుగా క్రమేణా వరద పెరుగుతోంది. ప్రస్తుతం డ్యాంలో 28.350 టీఎంసీలు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,700 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నగదు దోపిడీ కేసులో నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నిందితు ల వివరాలను ఆ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. నెల్లూరులోని చంద్రబాబు నగర్‌కు చెందిన విజయ్ అలియాస్ వుండా, జీ సుధీర్, షేక్ సిరాజ్, పోలీసు కాలనీ ప్రాంతానికి చెందిన పీ అనీల్, బీ సాయికుమార్ చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. నగదు కోసం దోపిడీలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం తల్పగిరి కాలనీ సమీపంలో ఎస్ నాగేంద్ర అనే వ్యక్తిని కత్తులతో చంపుతామని బెదిరించి అతని ఫోన్‌పే నుంచి రూ.5 వేల నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తా మని బెదిరించి వెళ్లిపోయారు. బాధితుని ఫిర్యాదుతో శనివారం వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను ఆదివారం చంద్రబాబు నగర్ సమీపంలో అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. సమావేశంలో ఎస్ఐ జీ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కణితి



అడవిలో వదిలేందుకు కణితిని వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

ఉదయగిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవలాలగడ్డలోని ఓ నివాస ఆవరణలోకి ఆదివారం అటవీ ప్రాంతం నుంచి కణితి తాగునీటి కోసం వచ్చింది. గమనించిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, లక్ష్మీప్రసన్న అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో కణితిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని వాహనంలో తీసుకెళ్లి దుర్గం రిజర్వు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

పోలీసుల విచారణపై మహిళల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఉదయగిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో చోటుచేసుకున్న షేక్ మహ్మద్ హమీద్ దారుణ హత్య కేసుకు సంబంధించి పోలీసులు చేపడుతున్న విచారణపై ఆదివారం రాత్రి స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బీసీ కాలనీకి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. హమీద్ హత్య ఘటనను ఆరీఫ్ అనే యువకుడు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అప్పటి నుంచి పోలీసులు అతని సెల్‌ఫోన్‌ను సీజ్ చేసేందుకు ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను ఆరీఫ్ ఎక్కడా అంటూ ఆరా తీస్తున్నారు. ఈ తరుణంలో ఆదివారం పోలీసులు ఆరీఫ్ తండ్రిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీంతో ఆరీఫ్ కుటుంబసభ్యులు, కాలనీవాసులు మరికొందరు బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. హత్య చేసిన వారిని పట్టుకోకుండా ఆరీఫ్ కోసం పోలీసులు ఇంటికి రావడం, కుటుంబ సభ్యులను తీసుకెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీనులు తమ సిబ్బందితో బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని వారితో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఏపీ పోలీస్ అధికారుల సంఘం కోఆప్షన్ సభ్యుడిగా వినోద్ కుమార్



వినోద్ కుమార్‌ను సత్కరిస్తున్న పోలీసు అధికారుల సంఘం నాయకులు

విడవలూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన గుండపు వినోద్ కుమార్ ఏపీ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడిగా ఆదివారం నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఏపీ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర, కార్య వర్గ సభ్యులు, వివిధ యూనిట్ల ప్రతినిధుల సమావేశం జరిగింది. విధి నిర్వహణలో ప్రతిభ, నిబద్ధత కనబరిచిన వినోద్ కుమార్‌ను రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడిగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనకల శ్రీనివాసులు నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా హజర తయ్య, సభ్యులు శ్రీహరి, శేషయ్య, గౌస్‌బాషా పాల్గొన్నారు.


ప్రసన్న ఇంట్లో దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటి మీద దాడి ఘటనపై దర్గామిట్ట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఈ నెల 7వ తేదీ రాత్రి నెల్లూరులోని సుజాతమ్మ కాలనీలో ఉన్న ప్రసన్న నివాసానికి గుర్తుతెలి యని వ్యక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని ఫర్నీచర్, కారు, పలు వస్తువులను ధ్వంసం చేశారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సంగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని గాంధీజన సంఘం వద్ద ముంబాయి రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి సంగం వైపు వస్తున్న పాలవ్యాను మార్గమధ్యంలో గాంధీజనసంఘం వద్ద రోడ్డుపక్కన ఆగి ఉండగా గాంధీజనసంఘం గ్రామానికి చెందిన సుబ్బరాజు టీవీఎస్ మోపెడ్‌పై వస్తూ పాల వ్యానును వెనుక వైపు ఢీకొన్నాడు. దీంతో సుబ్బరాజు కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడ్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తిని గంజాయి సరఫరా చేస్తుండగా ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనుంచి కేజీ 3 వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. కేసు నమోదు చేసి, ముద్దాయిని కోర్టుకు హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రసన్న వ్యాఖ్యలపై మహిళల నిరసన ర్యాలీ



ఇందుకూరుపేటలో నిరసన ర్యాలీ నిర్వహించిన మహిళలు

ఇందుకూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కొత్తూరు నుండి మండల తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. వెంటనే ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోవూరు నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన మొదటి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, పీఎల్ రావు, కొండూరు వెంకటరమణారెడ్డి, ముంగర గోపాల్, అవ్వారు ఏడుకొండలు, రామచంద్రయ్య, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డితో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100) : 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9414
వెండి కిలో ధర	రూ. 115600
వెండి ఒక గ్రాము	రూ.118.60

కరేడులో పర్యటించిన ఎమ్మెల్సీ తూమాటి

ఉలవపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు ప్రాంతంలోని టెంకాయచెట్ల పాలెం, కొత్త, పాత పల్లెపాలెంలు, చైతన్యనగర్ ఎస్సీ కాలనీ, మందబైలు సంఘం ఎస్టీ కాలనీలలో ఆదివారం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పర్యటించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కరేడులో భూసేకరణ విషయంపై ప్రజాగ్రహం, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల అభీష్టం తెలుసుకునే ందుకు రెండు రోజులు పర్యటించానన్నారు. ఇక్కడి పరిస్థితులను త్వరలో జరగనున్న డీఆర్సీ, అసెంబ్లీ సమావేశాల్లో వివరిస్తానన్నారు.

న్యూస్ బాక్స్

కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు

అల్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : సినీరంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న కోట శ్రీనివాసరావు మృతి ఆ రంగానికి తీరని లోటని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు బడబాగ్ని ఆంజనేయరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ పాత్రలోనైనా నటించి ప్రేక్షకులతో శభాష్ అనిపించుకునే విలక్షణ నటుడిగా మంచి గుర్తింపును, ప్రేక్షకుల మన్ననలను పొందిన కోట మృతి చెందడం బాధాకరమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లా యాసలో అయినా సునాయాసంగా డైలాగులు చెప్పి మెప్పించగలిగే సత్తా కలిగిన నటుడని, ప్రతి అభిమాని గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

బిట్రగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రైల్వే మిక్సిడ్ తెలుగు మీడియం పాఠశాలలో 1980-81వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. 45 ఏళ్ల తరువాత పాతమిత్రులు కలుసుకోవడంతో ఆప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. కలిసి చదువుకున్న ఊరిని మరువకుండా పూర్వపు విద్యార్థులు కలుసుకోవడం మంచి సాంప్రదాయమని డాక్టర్ రభాని, మాజీ సైనికుడు బోయపాటి సుధాకర్, డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు అన్నారు.

అపస్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

కందుకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) ప్రాంతీయ కార్యాలయాన్ని ఆదివారం కందుకూరులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులలో సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హిమజ, రాజగోపాల్‌బాబు, ఆకురాతి బలరామకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు వేగవంతం

● కలుగోళ్ల శాంభవి ఆలయానికి మహర్దశ



వరవ కాలువలో నిర్మిస్తున్న కాంక్రీట్ పిల్లర్లు

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయ ప్రాంగణం ఆధునికీకరణలో భాగంగా దానిని ఆనుకుని ఉన్న వరవ కాలువపై శ్లాబు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతోన్నాయి. ఈ పనులు పూర్తయితే ఆలయానికి మహర్దశ పట్టనుంది. కాలువపై శ్లాబు నిర్మాణం కోసం పురపాలక సంఘం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయగా ఆ నిధులతో పనులు చకచక సాగుతున్నాయి. శ్లాబ్ నిర్మాణ పనుల కోసం కాలువ మధ్యలో కాంక్రీట్ పిల్లర్లు నిర్మించి దానిపై శ్లాబు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. శ్లాబ్ నిర్మాణం అయితే ఆ కాలువ ప్రాంతం కూడా ఆలయం లోపల ఆవరణలో కలిసి ఆలయానికి మంచి వాస్తు ఏర్పడటమే కాక ఆలయం లోపల విశాలంగా వసతి ఏర్పడుతోంది. కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద ఆర్వోబీ స్థానంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలనే ఆలోచనలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రభుత్వంతో చర్చిస్తున్నారు. అదే జరిగితే ఆలయం వద్దకు వెళ్లే దక్షిణం వైపున ఉన్న ప్రధాన మార్గం మూసుకుపోతోంది. దీంతో ముందు చూపుగా ఆలయానికి ఈశాన్యం తక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఉన్న వరవ కాలువపై శ్లాబ్ నిర్మాణం చేపట్టి దాని మీదుగా ఆలయంలోకి తూర్పు మార్గంలో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఆలయానికి ఈశాన్యం తగ్గి వాస్తు లోపం ఉండటంతో శ్లాబ్ నిర్మాణంతో ఈశాన్యం పెరిగి వాస్తు దోషం కూడా పోయే అవకాశాలు ఉన్నాయి. అలాగే అక్కడ రైల్వే అండర్‌పాస్ మంజూరు కోసం ఆలయానికి దారి ఉండదన్న ప్రధాన ఆటంకాలు కూడా తొలగిపోయి అండర్‌పాస్ మంజూరుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

బస్టాండ్ సెంటర్‌లో యాచకుడి మృతి



వలేటివారిపాలెం బస్టాండు సెంటర్‌లో యాచకుడి మృతదేహం

వలేటివారిపాలెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వలేటివారి పాలెం బ స్టాండు సెంటరులో పామూరుకు చెందిన గురునాథం నాగరాజు(30) అనే యాచకుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాగరాజు ప్రతిరోజూ వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో భిక్షాటన చేస్తూ సమీపంలోని కేజీబీవీ స్కూల్ పక్కన ఉన్న ఎస్టీ కాలనీలో జీవనం సాగిస్తు న్నాడు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఎస్ఐ మరిదినాయుడు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశబుూలించారు. నాగ రాజుకు ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధి ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు!

వలేటవారిపాలెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో గుట్కా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామాల్లోని కిరాణ షాపులు, టీ, సిగిరెట్, కూల్‌డ్రింక్స్ తదిరత బడ్డీకొట్టుల్లో గుట్కా విక్రయిస్తున్నట్లు తిలిసింది. రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధించింది. అయినప్పటికీ వలేటివారిపాలెం మండలంలో గుట్కా విక్రయాలు జోరు తగ్గడం లేదు. గుట్కా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా వర్ధిల్లుతుంది. ప్రభుత్వం వివిధ ప్రచారాల ద్వారా గుట్కా వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం గుట్కా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సిగిరెట్, గుట్కాలు అనారో గ్యాన్ని హాని కలిగిస్థాయని తెలిసినా యువత వాటికి బానిసలుగా మారిపో తున్న దుస్థితి నెలకొంది. ప్రతి బడ్డీ కొట్టులోనూ, కిరాణా దుకాణాలలో గుట్కా వ్యాపారం రహస్యంగా జరుగుతుంది. ఈ క్రమంలో మండలంలో గుట్కా వ్యాపారాలు లక్షల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. యువత గుట్కా మత్తులో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది. గుట్కాలో నికోటిన్ అనే పదార్థం ఉండడంతో ప్రాణానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. గుట్కాతో ఆకలి మందగించి చిగుళ్ల వ్యాధి శరీరంలోని ఏ బాగానికైనా వ్యాపించి కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే గుట్కా విక్రయాలను నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వంటసామగ్రి, దుస్తులు, బియ్యం అందచేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆదివారం కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు వంటసామగ్రి, దుస్తుల తోపాటు ఒక బియ్యం బస్తాను అందజేశారు. కావలి మండలం గౌరవరం గిరిజన కాలనీకి చెందిన గోల్కొండ వెంకాయమ్మ కుటుంబం శనివారం ఉదయం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఒక్క వస్తువు మిగలకుండా సర్వస్వం కాలిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకుడు చింతం బాబుల్‌రెడ్డి, గిరిజన కార్యకర్త ఇండ్ల సురేంద్ర రెడ్‌క్రాస్‌కు సమాచారం అందిం చారు. దీంతో రెడ్‌క్రాస్ విపత్తుల నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బృందం ఆదివారం గౌరవరం వెళ్లి జిల్లా రెడ్‌క్రాస్ అందించిన వంట పాత్రల సెట్, కావలి రెడ్‌క్రాస్ ద్వారా దుస్తుల కిట్, మనోహర్ సొంత నిధులతో ఒక బియ్యం బస్తాను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలి ఛైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కే.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు బీద లక్ష్మానంద, బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళా చిన్నారులకు అభినందన



చిన్నారులను అభినందిస్తున్న డాక్టర్ శివప్రసాద్

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ఆ ధ్వర్యంలో రక్తం యొక్క ఆవశ్యకతపై ఇటీవల జరిగిన లఘు నాటిక ప్రదర్శనలో ప్రతిభచాటి ప్రథమ బహుమతిని పొందిన సంయుక్త నృత్యకళానిలయంలో నృత్యకళా చిన్నారులను బీవీ రత్నమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందించారు. ఆదివారం క్రిష్టియన్‌పేట మొదటిలైన్‌లో ఉన్న నృత్యకళానిలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పామూరు శివప్రసాద్, ట్రస్ట్ నిర్వహ కు డు ప్రసాదరావు మాట్లాడుతూ ఈ చిన్నారులు రక్తం యొక్క ఆవశ్యకతపై చేసిన లఘునాటిక చూపరులను కంటతడి పెట్టించిందన్నారు. రక్తం దొరకని పక్షంలో బాధితులు పడే ఆవేదనను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే నాట్యగురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, జి.కల్యాణి, పచ్చిపులుసు వెంకన్న, అర్వపల్లి నాగరాజు, పామూరు రాజ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు ఇస్తున్నాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో శాకాహర ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోట్లూరు రాజుల బజార్, పోట్లూరు గిరిజన కాలనీల్లో ఆయన ఆదివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు అమలు పరిచిన సంక్షేమ పథకాలను వివరించ్చారు. కాలనీల్లో ప్రతి పిల్లవాడికి తల్లికి వందనం వందశాతం అందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కొందరు గిరిజనులు ఇళ్ల స్థలాలు లేవని, సరైన సైడుకాలువలులేక ఇబ్బందులు పడుతున్నామని తెలపగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉందుగా గోపయ్య సమేత తిరపతమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు పాతపల్లి శ్రీనివాసరాజు, చౌటూరి సుబ్బారావు, ఎస్కే రహంతుల్లా, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహాకరుణ శాకాహార మెగా ర్యాలీ

కందుకూరు : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పట్టణంలో మహాకరుణ శాఖాహార మెగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కోటారెడ్డి నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు, సామాజిక సేవాసంస్థల ప్రతినిధులు, శాఖాహారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం

లింగసముద్రం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరుగుతాయని టీడీపీ సీనియర్ నాయకుడు ఉన్నం వీరాస్వామి చెప్పారు. మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం రమేష్, ఇతర టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు బొల్లినేని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు


వైభవంగా అలఘునాథుడి కల్యాణం



అలఘునాథుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాధుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆగస్టు 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగు మహా కుంబాభిషేక మహోత్సవానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శాకంబరి అలంకారంలో పాలేటి గంగమ్మ



సంగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న పాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా క్షీర, పంచామృత, సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో నాగవరపమ్మకు పూజలు



నాగవరపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగవరపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నాగవపమ్మదేవి మూలవిరాట్‌కు క్షీర, సకల ద్రవ్య పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఘనంగా గంగాభవానీ అమ్మవారికి నెల పొంగళ్లు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఉన్న అనంతపూరి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు నెలపొంగళ్లు ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రితో మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు యూడీఎఫ్ ప్రతినిధుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యూడీఎఫ్ ప్రతినిధులు


ఉదయగిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను యూడీఎఫ్ ప్రతినిధులు షేక్ ఎండీ ఖాజా, వీ రామచంద్రమూర్తి కోరారు. ఈమేరకు ఆదివారం వారు మండలంలోని గంగిరెడ్డిపల్లికి వచ్చిన ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షాధారం, చిన్న సాగునీటి వనరులపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారని, వర్షాలు కురిసే సమయంలో నీరు వృథా కాకుండా చెరువులు, చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్లను ఆధునికీకరించాలన్నారు. ఉదయగిరి, వింజమూరు వైద్యశాలల స్థాయిని వంద పడకలకు పెంచడంతోపాటు ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాకలో మూతపడ్డ యునాని, ఆయుర్వేద వైద్యశాలలను తెరిపించాలన్నారు. నియోజకవర్గాన్ని సాంకేతికపరంగా అభివృద్ధి చేయడంతోపాటు గంగిరెడ్డిపల్లికి మంజూరైన షైనారిటీ కళాశాల పనులు ప్రారం బించేలా చూడాలన్నారు. చారిత్రాత్మక ప్రదేశమైన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి

మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డితో కలిసి ప్రధానోపాధ్యాయుడు చల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఇటీవల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని, తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి అదనపు తరగతి గదుల మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

● పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్లకు గ్రావెల్ నింపుతున్న ఎక్స్‌కవేటర్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 13 (ఆంధ్రజ్యోతి): అసలే ఆదివారం సెలవు దినం.. ఆపై కనిపించని అధికారుల జాడ. ఇక అడిగేవారు లేరులే అన్న ధీమాతో కొంతమంది వ్యాపారులు యథేచ్ఛగా గ్రావెల్ తరలింపునకు పూనుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మండలంలోని జీ.కొత్తపల్లి గ్రామ శివారు ఇరిగేషన్ చెరువులో సారవంతమైన గ్రావెల్ ఉండడంతో వ్యాపారులు ఎక్స్‌కవేటర్ ద్వారా తవ్వకాలు సాగించి ట్రాక్టర్లతో సమీప జీ.కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నా అడ్డుకునేవారే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



అనంతసాగరం: కరపత్రాలు ఇస్తున్న మధుసుధన్‌రెడ్డి

అనంతసాగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు టీడీపీ మండల సీనియర్ నాయకుడు పాతపాటి మధుసుదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మంచాలపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది పాలన తీరుపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

●**సంగం :** అధికారం చేపట్టిన తొలి ఏడాదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఎన్నికల హామీలను అమలుపరిచిందని సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేసి వారు లబ్ధి పొందిన పథకాల వివరాలతోపాటు సమస్యలను అడిగి తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ కమిటీ ఎన్నిక



నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ జ్యోతి శ్రీనివాసులును అభినందిస్తున్న జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షురాలు కె పుష్పాంజలి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ లీగల్ అడ్వజర్‌గా జ్యోతి శ్రీనివాసులు, ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా కె హజరత్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బుర్రా శేషాద్రి, బీఎస్పీ సభ్యులు పాల్గొన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని నాగులపాడు, చెర్లోయడవల్లి, అల్లీపురం, రావులకొల్లు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ప్రబోద సేవాసమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి పెంచలనరసయ్య, సభ్యులు బి కృష్ణయ్య, పి మధు, పి గాయత్రి, ఈ పద్మమ్మ, శేషాద్రి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 31 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని భైరవరం గ్రామంలో ఆదివారం నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగపట్ల సింహాద్రి, గొల్లపల్లి మోహన్‌రావు, వెంగయ్య, అవినాష్, పెంచలమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్‌కార్డు లేని, పోగొట్టుకున్న ఎస్టీ వర్గ ప్రజల సౌకర్యార్థం ఆధార్‌కార్డుల మంజూరుకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమంతరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమ, మంగళవారాలు దుత్తలూరు-1, బుధ, గురువారాల్లో నర్రవాడ, శుక్ర, శనివారాల్లో నందిపాడు సచివాలయాల్లో ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఎస్టీ వర్గ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తూపిలిపాళెంలో హేయ్.. హేయ్



వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలతో పాటు తిరుపతి నుంచి వచ్చిన పర్యాటకులతో తీరం కళకళలాడింది. పిల్లలు, యువత ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. - వాకాడు, ఆంధ్రజ్యోతి

వానరాలకు పండ్లు



భాకరాపేట ఘాట్‌కు రెండువైపులా వానరాలు గుంపులుగా చేరుతుంటాయి. తిండికోసం వచ్చీ పోయే వాహనాల వైపు ఆశగా ఎదురు చూస్తుంటాయి. దీనిని గమనించిన భాకరాపేట ఇటుకల బట్టీ యజమాని సిద్దరామిరెడ్డి వారంలో మూడు రోజులు బిస్కెట్లు, పండ్లు అందిస్తున్నారు. - భాకరాపేట, ఆంధ్రజ్యోతి

పట్టర ఓ పట్టు



అది చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లే దారి. దీనికి అడ్డంగా ఉన్న కాలువపై ఇనుప రాడ్లతో జల్లెడలా వేయగా.. అది వంగిపోయింది. ఇలా ఆదివారం వారపు సంతకోసం కొందరు రైతులు కలిసి మినీ లారీలో కూరగాయలు వేసుకుని రాగా ఆగిపోయింది. దీంతో మహిళా రైతులూ తమ వంతు చేయి వేసి నెట్టడంతో ముందుకు కదిలింది. - చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

క్యాన్సర్‌ను అరికట్టేందుకు కృషి చేద్దాం


● టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో సీఎంఈ సదస్సు

తిరుపతి(వైద్యం), జూలై 13(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక పద్ధతులను అనుసరించి క్యాన్సర్‌ను సంపూర్ణంగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరం కలిసి కృషి చేద్దామని హైదారాబాదుకు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన ఆంకాలజిస్టు డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని స్విమ్స్(టాటా క్యాన్సర్ ఆస్పత్రి)లో ఏపీ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ(ఏపీఏఎస్‌వో) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీఎంఈ(కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) సదస్సులో ఆయన మాట్లాడారు. స్వీకర్ ఆస్పత్రిలో ల్యూమినల్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్(జీఐ) క్యాన్సర్లపై దృష్టి సారిస్తూ క్యాన్సర్ నిర్మూలన దిశగా అడుగులు గొప్ప విషయమన్నారు. ఏపీఏఎస్‌వో రాష్ట్రంలో సర్జికల్ ఆంకాలజీ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న వృత్తిపరమైన సంఘమని ఇది వైద్య విద్యను, పరిశోధనలను ప్రోత్సహిస్తుందన్నారు. ఇటువంటి సీఎంఈ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల సర్జికల్ ఆంకాలజీ నిపుణుల మధ్య సహకారాన్ని పెంచడంతోపాటు ఆధునాతన వైద్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సదస్సులో భాగంగా అత్యాధునిక పద్ధతులు, మల్టీ డిసిప్లినరీ ట్రీట్మెంట్, కొత్త శస్త్ర చికిత్సా విధానాలపై చర్చలు జరపడం ద్వారా మన ప్రాంతంలో క్యాన్సర్ బాధితులకు మెరుగైన ఫలితాలు అందించే అవకాశం లభిస్తుందని స్వీకర్ ఆస్పత్రి సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత్ పెనుమాడు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు తమ అనుభవాలను, అధునాతన వైద్య పద్ధతులను వివరించారు. ప్రముఖ ఆంకాలజిస్టులు శరద్ దేశాయ్, రుద్ర ప్రసాద్ ఆచార్య, నరేంద్ర, మురళీకృష్ణ, నాగకిశోర్, హరికృష్ణతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంకాలజిస్టులు దాదాపు 280 మంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖ సర్జికల్ ఆంకాలజీ వైద్య నిపుణులు

తిరుమలలో భక్తుల రద్దీ



రింగురోడ్డులోని క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నుంచి తిరుమలకు భక్తుల తాకిడి పెరిగిన విషయం తెలిసిందే. శుక్ర, శనివారాల తరహాలోనే ఆదివారం కూడా భక్తులతో తిరుమల కొండ కిటకిటలాడింది. సాధారణంగా ఆదివారం సాయంత్రానికి వారాంతపు రద్దీ తగ్గుతుంది. కానీ ఆదివారం రాత్రి 9 గంటలైనా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరి పార్కులోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శన సమయం పడుతోంది. క్యూలైన్‌లో చేరే భక్తుల సంఖ్య కొనసాగుతునే ఉన్న క్రమంలో సాయంత్రానికి కల్యాణవేదిక వద్ద క్యూలైన్ మూసివేశారు. రద్దీ అధికంగా ఉన్న క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు క్యూలైన్‌లోకి ప్రవేశించాలని ప్రకటనలు చేస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టాపాయిండ్లు కేంద్రంగా
డీజిల్ దందా

60 తమ యజమానులకు తెలియకుండా లారీ డ్రైవర్లు డీజిల్‌ను దుకాణదారులకు అక్రమంగా అమ్మే ధర ఇది.

89 స్థానిక వాహనదారులు, ఒక్కోసారి పెట్రోల్ బంకుల వాళ్లకూ దుకాణదారులు విక్రయించే ధర.

● లారీల వద్ద తక్కువ ధరకు కొని విక్రయాలు ● అధికారుల దాడులు.. కేసు నమోదు చేయని వైనం

దొరవారిసత్రం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీజిల్ అక్రమ విక్రయాలకు దొరవారిసత్రం మండలం టపాయిండ్లు కేరాఫ్‌గా మారింది. సూళ్లూరుపేట టోల్ ప్లాజాకు చేరువలో ఉన్న ఈ గ్రామంలో జాతీయ రహదారికి రెండు వైపులా ఇళ్లున్నాయి. ఇళ్ల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకొని లారీల నుంచి డీజిల్ కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. ఇలా పది మంది దీనినే వ్యాపారంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. వేలాది లీటర్ల డీజిల్ నిల్వ చేసి ఉంచుతున్నారు. గతేడాది డీజిల్ విక్రయాల దుకాణలు మరిన్ని పెరిగాయి. తమ దుకాణల వద్ద డీజిల్ కొనుగోలుకు ఒక సంకేతంలా వాటర్ క్యాన్లు, డీజిల్ క్యాన్లను జాతీయ రహదారి పక్కన వేలాడ కడుతున్నారు. వీటిని చూసిన లారీ డ్రైవర్లు ఆ దుకాణల వద్ద ఆపి.. ఆ లారీల నుంచి లీటర్ రూ.60 వంతున డీజిల్ అక్రమంగా అమ్మేస్తుంటారు. వచ్చిన కాడికి లాభం అనుకుని ఇలా తమ యజమానులను మోసం చేస్తున్నారు డ్రైవర్లు. ఈ డీజిల్‌ను కొనే దుకాణదారులు స్థానికంగా ట్రాక్టర్ల యజమానులకు, ఇతర వాహనాలకు లీటర్‌ను రూ.89 లెక్కన ఇస్తున్నారు. ఇద్దరు దుకాణదారులైతే పెద్ద ఎత్తున్న నిల్వలు చేసి సూళ్లూరుపేటలోని ఓ పెట్రోల్ బంకు యాజమాన్యంకు అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. ఓ మినీ డీజిల్ ట్యాంకర్ ఈ దుకాణల వద్దకు వచ్చి తీసుకెళుతుండటం గమనార్హం. ఇలా నెలకు లక్షలాది లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయి.



టపాయిండ్లు వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన క్యాన్లు

అధికారుల దాడులు.. కేసుల్లేవు మరి

స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో ఇక్కడి డీజిల్ విక్రయాలపై శనివారం గూడూరు సెక్షన్‌కు చెందిన తూనికల కొలతలు (లీగల్ మెట్రాలజీ) శాఖ అధికారులు దాడులు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 10 దుకాణాలపై దాడులు జరిపారు. రెండు దుకాణాల్లో సుమారు నాలుగు వేల లీటర్ల డీజిల్ ఉన్నట్లు గుర్తించారు. మరో నాలుగు దుకాణాల్లో 5 వేల లీటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. డీజిల్ అక్రమ నిల్వలపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. చర్యలూ తీసుకోలేదు. జరిమానా పేరిట చేసిన వసూళ్లకూ ఎలాంటి రశీదులు ఇవ్వలేదు

జరిమానాలు విధించాం

ఈ వ్యవహారంపై తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. టపాయిండ్లు వద్ద డీజిల్ విక్రయాల దుకాణాలపై దాడులు చేశామని తెలిపారు. నాలుగు దుకాణాలకు రూ.37 వేల జరిమానా విధించామన్నారు. దుకాణదారులకు జరిమాన రశీదులు ఇచ్చారా అని అడగ్గా.. సమాధానం దాటవేశారు. పంచనామాలు రాసుకొచ్చినట్లు చెప్పారు. డీజిల్ అక్రమంగా విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేశారా అనగా.. విజిలెన్స్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



శ్రీనివాసులు మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి కీర్తి - శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)

న్యాయం జరిగే వరకు పోరాటం

● రాయుడి సోదరి కీర్తి ఆవేదన.. స్పష్టీకరణ

● మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి ● వినుత దంపతులతోపాటు మరో ముగ్గురికి 14 రోజుల రిమాండ్

శ్రీకాళహస్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మా అన్న రాయుడు (శ్రీనివాసులు) హత్యకేసులో న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని కీర్తి ఆవేదనా స్వరంతో చెప్పారు. శ్రీకాళహస్తి మండలం బొక్కిసంపాళేనికి ఆదివారం చెన్నైనుంచి మృతదేహం రాగానే అమ్మమ్మ రాజేశ్వరి, సోదరితో పాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కీర్తి విలపిస్తూ, మాట్లాడారు. 'జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ప్రాణం కన్నా ఎక్కువగా మా అన్న అభిమానించేవాడు. ఎన్నో సంవత్సరాల నుంచి జనసేన ఇన్‌చార్జి వినుత దంపతుల వద్ద అహర్నిశలు శ్రమిస్తూ వారిఉన్నతి కోసమే తపించేవాడు. ఇటీవల మా అన్న కాలు జారిపడటంతో గాయమైందని వినుత దంపతులు మాకు ఫోన్ ద్వారా చెప్పారు. మేము ఇంటికి వెళ్లి చూడటంతో కాలికి గాయమైంది. మా అన్న శ్రీనివాసులుకు రెండువైపులా ఇద్దరు కూర్చుని మాట్లాడనీయకుండా కట్టడి చేశారు. మా వ్యక్తిగత విషయాలను రాజకీయ ప్రత్యర్థులకు మీ అన్న చెరవేస్తున్నాడంటూ వినుత దంపతులు మాకు చెప్పారు. తర్వాత మళ్లీ విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి ఇంటికిపంపేశారు. ఆ తరువాత కూడా చాలాసార్లు పిలిపించుకున్నారు. పని కోసం పిలుస్తున్నారని మేం అనుకున్నాం. కానీ చిత్రహింసలకు గురి చేసి హతమార్చేశారు. చెన్నై పోలీసులు చెప్పే వరకు మా అన్న చనిపోయాడన్న విషయం కూడా తెలియదు. వారిని కఠినంగా శిక్షించాలి' అంటూ కీర్తి కోరారు. కాగా, మృతదేహం రాక సమాచారం తెలుసుకున్న శ్రీనివాసులు అలియాస్ రాయుడు స్నేహితులు, బంధువులు బొక్కిసంపాళెం చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.

నిందితులకు 14రోజుల రిమాండ్

డ్రైవర్ శ్రీనివాసులును హత్య చేశారన్న కేసులో చెన్నైలోని సి3 సెవెన్ వెల్స్ పోలీసులు జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతతోపాటు భర్త చంద్రబాబు, వారికి సహకరించిన శివకుమార్, గోపి, తస్సర్ బాషాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి న్యాయమూర్తి ఎదుట వారిని చెన్నై పోలీసులు హాజరు పరచగా 14రోజుల పాటు రిమాండ్ విధించారు. చెన్నైలోని పుళల్ సెంట్రల్ జైలుకు వీరిని తరలించారు.

గ్రూప్-2 బ్యాక్‌లాగ్ పోస్టుల పేరిట రూ.85 లక్షల మోసం

● పోలీసులకూ ఫిర్యాదు ● చర్యల్లేవంటూ మీడియాకెక్కిన బాధితులు

తిరుపతి(నేర విభాగం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఎంప్లాయిమెంట్ ఆఫీసులో అధికారిని చెప్పారు. ఉద్యోగాలు తీసిస్తానని రూ.85 లక్షల వరకు వసూలు చేసి.. మోసం చేశారు. దీనిపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ బాధితులు శుక్రవారం మీడియాను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. రెవెన్యూ విభాగంలో బ్యాక్‌లాగ్ (తహసీల్దారు, డీటీ, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్) పోస్టులు ఇప్పిస్తామని తిరుపతి ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగినంటూ ఒకరు పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు వసూలు చేశారు. తన పిన్ని, బాబాయ్‌ని, మంగళగిరిలో ఓ ఉన్నతాధికారిని కలుపుకొని ప్లాన్ ప్రకారం నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన రబ్బర్ స్టాంపులు, లెటర్ ప్యాడ్లు తయారు చేశారు. ఒప్పందం కుదిరిన అభ్యర్థులకు.. తిరుపతిలో ప్రభుత్వ తరహాలో పరీక్ష నిర్వహించారు. సెల్ఫ్ ఇంటర్వ్యూ, వీడియో తీసుకున్నారు. కాంపిటిటివ్ మెరిట్ లెటర్లు పంపారు. తర్వాత అపాయింట్‌మెంట్ లెటరు వస్తుందని, వేచి చూడాలని చెప్పారు. 14 నెలలుగా ఎదురు చూసినా అపాయింట్‌మెంట్ లెటర్లు రాలేదు. దీంతో వీరంతా రెండు నెలల కిందట సంబంధిత ఆఫీసుకు వెళ్లి అడగ్గా.. ఇవన్నీ నకిలీ లెటర్లని, నకిలీ స్టాంపులని చెప్పడంతో కంగుతిన్నారు. ఆ నలుగురిని ప్రశ్నించినా.. డబ్బులిచ్చేయమని బతిమలాడినా సమాధానం లేకపోగా, చివరకు ఎదురు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. దీంతో తిరుపతికి చెందిన దాదాపు 20 మందిలో 14 మంది బాధితులు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. రెండు నెలలవుతున్నా పోలీసుల నుంచి సమాధానం రాకపోవడంతో బాధితులు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మీడియాకు వివరించారు. సోమవారం కలెక్టర్‌ను కలవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కేసు దర్యాప్తులో ఉంది

బాధితులు ఎస్పీ హర్షవర్ధనరాజుకు రెండు నెలల కిందట ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే ఆయన విచారించి కేసు నమోదు చేయాలని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంను మే 24న ఆదేశించారు. ఈ కేసు తిరుపతి రూరల్ పరిధిలోది కావడంతో ఆయన.. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌కు పంపారు. ఈ అంశాన్ని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుతో 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం యర్రమరాజుపల్లెకి చెందిన ఎ.రాధాకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఉద్యోగినంటూ చెప్పిన పి.లక్ష్మితో పాటు పి.వేణుగోపాల్, పి.విద్య, హారికపై మే నెలలోనే కేసు నమోదు చేశామని.. దర్యాప్తు దశలో ఉందని సీఐ చెప్పారు.

అంత అలసత్వం ఎందుకో?

మూడు వారాల క్రితం కూలిన విద్యుత్ స్తంభం

సరఫరా లేక రైతుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు



చెన్నప్పనాయుడుపేట పొలాల్లో నేల కూలిన విద్యుత్ స్తంభం

పెళ్లకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నప్పనాయుడుపేట గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న ఓ విద్యుత్ స్తంభం గత నెల 20వ తేదీన ఈదురు గాలులకు నేలకూలింది. దీంతో సరఫరా ఆగిపోవడంతో ఎడగారులో సాగు చేస్తున్న వరిపంటకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. కూలిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలంటూ సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించారు. అయితే విద్యుత్‌శాఖ ఏఈతో పాటు ఇతర సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. రైతులు ఫోన్ చేసినా ఏఈ స్పందించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమి లేక రైతులమే కర్రలు ఏర్పాటు చేసుకుని విద్యుత్ తీగలు అమర్చుకుని తాత్కాలికంగా మోటర్లు వేసుకుంటున్నారు. అంతేకాకుండా విద్యుత్ స్తంభం పొలాల్లో పడిపోయి ఉండడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రకాశంకాలనీలో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, ఆటోతో పోలీసులు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల ప్రకాశంకాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వాకాడు సీఐ హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో వాకాడు, కోట, చిట్టమూరు ఎస్‌ఐలు నాగబాబు, పవన్‌కుమార్, చినబల రామయ్యతో పాటు పలువురు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ప్రకాశం కాలనీలో తనిఖీలు చేపట్టారు. సరైన రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహదేవయ్య నగర్‌లో ఆదివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సరైన ధృవీకరణపత్రాలు లేని పది మోటరుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మురళీకృష్ణ కోరారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్రత టిక్కెట్ల విక్రయాల్లో అక్రమాలు తగదు

గూడూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సాయిబాబా గుడిలో గురుపౌర్ణమి వ్రతం టిక్కెట్‌ల విక్రయాల్లో అక్రమాలు జరిగాయని భక్తులు ఆరోపించారు. గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక శిరిడి సాయిబాబా మందిరంలో సాయి వ్రతంలో పాల్గొనేందుకు ఆలయంలో వ్రత టిక్కెట్లు విక్రయించారు. ఈ సందర్భంగా కొందరు ఆలయ కమిటీ సభ్యులు టిక్కెట్ల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడడంతో భక్తులకు అందకపోవడంతో పూజల్లో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. కౌంటర్లను ఏర్పాటు చేసినా టిక్కెట్లను పారదర్శకంగా విక్రయించకుండా తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అందజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా కమిటీ పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని భక్తులు కోరారు.

చెంగాళమ్మకు శాకంబరి అలంకారానికి

కూరగాయలు, పండ్ల స్వీకరణ

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని ఈనెల 18న శాకంబరిగా అలంకరించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషన్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఇందుకోసం భక్తుల నుంచి కూరగాయలు, పండ్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మూడు రకాల కూరగాయలు, రెండు రకాల పండ్లను ఈనెల 16వ తేదీ సాయంత్రంలోగా ఆలయ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేస్తున్న చెంచురామయ్య కుటుంబ సభ్యులు

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరిగే నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆదివారం గూడూరుకు చెందిన చెంచురామయ్య కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆదివారం దేవదాయశాఖ సహాయ కమిషన్ ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేశారు.

రేపు శ్రీవారికి పరదాల సమర్పణ

తిరుపతి(ఆటోనగర్), జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన వాసు టైలర్స్ అధినేత మేకల సుబ్రమణ్యం(మణి) తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు మూడు తెరలను(పరదాలు) సిద్ధం చేశారు. వాటిని సోమవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అధికారులకు అందించనున్నారు. ఉగాది ఆస్థానం, ఆణివారి ఆస్థానం, సాలకట్ల బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల కోసం మూడు చొప్పున ప్రత్యేక పరదాలను తయారు చేస్తారు. ఒకరోజు ముందు కాలి నడకన తిరుమలకు చేరుకుని పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయాధికారులకు అందజేస్తామని మణి తెలిపారు. 27 ఏళ్లుగా పరదాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు.



సిద్ధం చేసిన పరదాలు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గంగమ్మకు నెల పొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పాలబూతు సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు నెలపొంగళ్లు పెట్టారు. ముందుగా గంగమ్మకు అభిషేకాలు జరిపి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గత నెల 13నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు గంగమ్మ జాతర నిర్వహించారు. నెలరోజులు పూర్తి కావడంతో ఆదివారం ఆలయం వద్ద మహిళా భక్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



చిల్లకూరులోని వినాయకుడి గుడి, పాలకేంద్రం సమీపంలో, దళితవాడ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

మలుపులు.. ప్రమాదాల పిలుపులు

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులో ప్రధాన రహదారిపై ఒకటన్నర కిలోమీటర్ల దూరంలోనే ఆరు మలుపులు ఉన్నాయి. మండల కేంద్రమైన చిల్లకూరు మీదుగా అయ్యవారిపాళెం, మేగనూరు, దివిపాళెం, తీపనూరు, ఓడూరు, ఎగువరాజుపాళెం తదితర గ్రామాలకు ప్రధాన రహదారి ఉంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రధాన రహదారిపై ఒక్క చిల్లకూరు గ్రామంలోనే ఒకటన్నర కిలోమీటర్ల దూరంలో ఆరు మలుపుల ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సూచిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక దళితవాడ సమీపంలోని మలుపు వద్ద గతంలో ఆటో బోల్తాపడి పలువురు గాయపడ్డారు. అదేవిధంగా పాలబూతు సమీపంలో, వినాయకుడి ఆలయం సమీపంలోని మలుపుల వద్ద పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద వేగ నిరోధకాలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: విజయశ్రీ



సాయినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టి, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సమస్యలను తమ దృష్టి తీసుకు వస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, వీసీసురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

గూడూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం నూతన కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, బాలకృష్ణ, మనోజ్ కుమార్, శ్రీనివాసరావు, సురేష్, వాసు, భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పెళ్లకూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలోని ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి కిషన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, నాయకులు, ఎద్దల రామకృష్ణారెడ్డి, కొమ్ముతోటి కైలాష్, పృధ్వీరాజు, నరసయ్య, భరత్‌కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా రాజుపాళెం రోడ్డు



అధ్వానంగా ఉన్న రాజుపాళెం రోడ్డు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి నుంచి రాజుపాళెం మీదుగా ఊనుగుంటపాళెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో కలిసే దారి అధ్వానంగా మారింది. రాజుపాళెం రోడ్డు మీదుగా గూడలి, రాజుపాళెం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, మైక్రోటవర్ కాలనీకి చెందిన వాహన చోదకులు, పాదచారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు తారు లేచిపోయి రాళ్లు తేలి ఉండడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రాజుపాళెంరోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె



మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనం చెల్లించాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అలాగే గతంలో చేసిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, బాలయ్య, కామేశ్వరరావు, బాబురావు, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, ప్రసాద్, నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పదాలకు సంబంధించి జీవో అమలు చేయాలన్న డిమాండ్లతో ఆదివారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, వెంకటసుబ్బయ్య, నరసింహులు, బుజ్జమ్మ, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

కోటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణులు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని ప్రగతి పాఠశాలలో ఆదివారం తిరుపతి అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది పరీక్షలు చేయించుకోగా, 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన తైక్వాండో పోటీలు



మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్న బాలబాలికలతో సుద్దాల అశోక్‌తేజ

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. తిరుపతి, పరిసర ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 300మంది బాలబాలికలు పోటీలలో ప్రాతినిధ్యం వహించారు. అండర్ 7, 11, 14, 17 విభాగాలలో విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సీనియర్ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అన్ని విభాగాలలో కలిపి 60బంగారు, 45వెండి, 110రజితం పతకాలు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ప్రధానమని, తల్లిదండ్రులు ఆ దిశగా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కాగా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలత ఉదయం తైక్వాండో పోటీలను ప్రారంభించి పిల్లల భవిష్యత్తుకు సంబంధించి సందేశమిచ్చారు. న్యాయనిర్ణేతలుగా సుదర్శన్(చెన్నై), బాలకృష్ణ(తిరుపతి), ఆనంద్(వైజాగ్), వెంకటేష్(కర్నూలు) వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వుకా విజయ్‌కుమార్, గ్రాండ్ మాస్టర్ బాబురావు, వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షకార్యదర్శులు టి.దామోదరం, ఎం.నాగార్జున, మణికంఠ, తహసున్నీషాబేగం, పురుషోత్తం, నారాయణ, ముకేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆనంద్‌కు మాతృవియోగం



మణెమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రఫీ తదితరులు

నాయుడుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ వార్డు సభ్యుడు సానాపుత్తూరు ఆనంద్‌కు మాతృవియోగం కలిగింది. ఆనంద్ తల్లి మణెమ్మ(83) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆనంద్ కుటుంబ సభ్యులు సుధాకర్, రవి, శీనులను ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ, ఉగ్గుమూడు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, లోకనాధం, జువ్వలపాటి మస్తాన్, సునీల్‌రెడ్డి, కిరణ్ తదితరులు పరామర్శించారు.

ఆర్థిక సాయం

నాయుడుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరులో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మునీశ్వర్ మృతి చెందాడు. అతడి స్నేహితులైన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, నాగరాజు, ప్రసాద్, బి.వెంకటేశ్వర్లు రూ.30వేల నగదు మునీశ్వర్ కుటుంబసభ్యులకు అందజేసి తమ స్నేహ ధర్మాన్ని చాటుకున్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమం 471కి చేరింది. పట్టణంలోని మన్నారు పోలూరుకు చెందిన కామిరెడ్డి రత్నమ్మ(85) ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి అభినందనలు



మాధవ్‌తో కోటేశ్వరరావు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు కేవీఎం మాధవ్‌ను ఆ పార్టీ నేత కొమారి కోటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. కోట మండలానికి చెందిన కోటేశ్వరరావు ఆదివారం హైదరాబాదులో మాధవ్‌ను కలిసి అభినందలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్

ఫుట్‌బాల్ టోర్నీలో మూడో స్థానం

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్(అండర్ 13) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లా జట్టు మూడో స్థానం కైవసం చేసుకుంది. రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సి-గ్రూప్‌లో విజేతలుగా నిలిచిన విశాఖపట్నం, కాకినాడ జట్లపై తిరుపతి జిల్లా జట్టు విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో పోరాడినా ఓటమి తప్పలేదు. మూడో స్థానం కోసం నిర్వహించిన పోటీలో కడప జట్టుపై విజయం సాధించి బ్రాంజ్‌మెడల్‌తో సరిపెట్టుకుంది. క్రీడాకారులను, కోచ్‌లు వినోద్, రమేష్‌లను ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురి అరెస్టు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం పంచాయతీ వీరారెడ్డిసత్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ.4,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం

ముత్యాలమ్మకు పూజలు



ప్రత్యేకాలంకారంలో ముత్యాలమ్మ

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు పూజలు



కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికిపలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

తిరుపతి(ఆటోనగర్), జూలై13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం 16, 17 డివిజన్లలో పార్టీ శాఖల మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి తమ పార్టీ ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. విస్తరణకు కాలనీలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్వచ్ఛ నగరం పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న ప్రస్తుత పాలకులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. తిరుపతిలో భూ కబ్జాదారులను అడ్డుకుని పేదలకు పంచిన ఘనత సీపీఐదేనన్నారు. నగర ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేసి, ఎన్నికల హామీ మేరకు రెండు సెంట్లతో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో నాయకులు అల్లాబక్ష్, విశ్వనాథ్, చలపతి, నాగరాజు, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు